


- ఏడేళ్లుగా నిలిచిన నియామకాల ప్రక్రియ
- కొన్ని శాఖల్లో పూర్తిగా ఆగిన వైనం
- ఉమ్మడి జిల్లాలో 550 దరఖాస్తుల పెండింగ్
- వయసు మీరుతుండడంతో ఆందోళనలో ఆశావహులు
- 'మెడికల్ అన్‌ఫిట్' విషయంలోనూ తీవ్ర జాప్యం

కారుణ్యమేదీ?

హనుమకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉండి.. అనారోగ్య కారణాలు, రోడ్డు ప్రమాదాలు ఇతరత్రా కారణాల వల్ల మరణించిన వారి వారసులు కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్నారు. ఏడేళ్లుగా ఈ నియామకాల ప్రక్రియను పట్టించుకోకపోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 550 మంది దరఖాస్తుదారులు ఎదురుచూస్తున్నారు. అయితే ఈ దరఖాస్తులు చేసుకున్న వారిలో పంచాయతీరాజ్, విద్యాశాఖలకు సంబంధించినవారే ఎక్కువగా ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 550 దరఖాస్తుల్లో పంచాయతీరాజ్ శాఖకు సంబంధించినవి సుమారు 175 ఉండగా విద్యాశాఖకు చెందినవి 190. రెవెన్యూలో 140 ఎక్సైజ్ శాఖకు సంబంధించినవి 45 ఉన్నాయి. వీరంతా కారుణ్య నియామకాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కానీ ఆయా శాఖల్లో వీటి గురించి పట్టించుకోకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. అయితే పంచాయతీరాజ్, విద్య, ఎక్సయిజ్, రెవెన్యూ శాఖల్లో కారుణ్య నియామకాలు పూర్తిగా నిలిచిపోయాయి. పోలీసు, విద్యుత్, నీటిపారుదల తదితర శాఖల్లో అలాగే ఆర్టీఈలో మాత్రం రెండేళ్ల క్రితం కొంత మేర నియామకాలు జరిపారు. ఈ నియామకాల గురంచి గత ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదని, ప్రస్తుత సర్కార్ కూడా ఇప్పటి వరకు దృష్టి సారించలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కారుణ్య నియామకాల కోసం దరఖాస్తులు చేసుకున్నవారు సంబంధిత ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా, పలుమార్లు కలెక్టర్లను కలిసి వినతి పత్రాలను అందజేసినా, ప్రజాప్రతినిధులను కలిసి వేడుకుంటున్నా ఫలితం లేకుండా పోయింది. కొవిడ్ సమయంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 180 మంది మృత్యువాత పడ్డారు. వీరిలో పలువురు ప్రభుత్వ ఉద్యోగులున్నారు. ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. కొవిడ్ వల్ల చనిపోయిన ఉద్యోగుల కుటుంబాల పిల్లలకు ఆరు నెలల్లో కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు కల్పించనున్నట్లు అప్పట్లో ప్రభుత్వం ప్రకటించింది. దీనితో చనిపోయినవారి స్థానంలో తమకు ఉద్యోగాలు ఇవ్వాలని పలువురు దరఖాస్తులు చేసుకున్నారు. అయితే దరఖాస్తు చేసుకున వారిలో వయసు పెరుగుతుండటంతో తమకు కొలువులు దక్కుతాయా లేదా అన్న ఆందోళన కనిపిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం కారుణ్య నియామకాలపై దృష్టి పెట్టాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

నోటిఫికేషన్లలో చేర్చి...

గతేడాది నుంచి రాష్ట్ర ప్రభుత్వం వివిధ నోటిఫికేషన్లు విడుదల చేస్తోంది. పలు శాఖల్లో ఖాళీలను అధికారులు ఇండెంట్ రూపంలో ఇవ్వడంతో వాటిని నోటిఫికేషన్లలో చేర్చారు. ఆయా జిల్లాలో కారుణ్య నియామకాల ద్వారా భర్తీ చేయాల్సిన పోస్టులను పక్కకు పెట్టకపోవడంతో ఆ పోస్టులు కూడా భర్తీ అయ్యే అవకాశం ఉంది. దీంతో కారుణ్య నియామకాల కోసం దరఖాస్తులు పెట్టుకున్నవారు ఆందోళన చెందుతున్నారు. అయితే ఆయాశాఖల్లో ఖాళీలకు నోటిఫికేషన్లు ఇచ్చినందు వల్ల కారుణ్య నియామకాలతో పాటు ఇతర కోట కింద పోస్టులు భర్తీ చేయవద్దని కలెక్టర్లకు సీఎస్ నుంచి ఆదేశాలు అందినట్టు సమాచారం.

నీటిపారుదల శాఖలో నో చాన్స్

నీటిపారుదల శాఖలో జూనియర్ అసిస్టెంట్, స్టెనో, టైపిస్టు ఉద్యోగాలను గ్రూప్ 4 ద్వారా మాత్రమే భర్తీ చేయాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కేటగిరి పోస్టులను డిపెండెంట్, కారుణ్య నియామకాల ద్వారా భర్తీ చేయరాదని ఇటీవల జారీ అయిన సర్క్యులర్‌లో పేర్కొన్నారు. దీంతో నీటిపారుదల శాఖలో కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్న వారి ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లినట్లయింది.

మెడికల్ అన్‌ఫిట్ పరిస్థితీ అంతే..

సర్వీస్‌లో ఉండి తీవ్ర అనారోగ్యానికి గురై ఉద్యోగం చేయలేని స్థితిలో ఉన్నవాళ్లు మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు పెట్టుకుంటారు. వారికి బదులు కుటుంబంలో ఎవరికైనా ఉద్యోగం ఇవ్వాలని కోరుతారు. ఇలాంటి దరఖాస్తులు కూడా ఉమ్మడి జిల్లాలో 43 వరకు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని పరిశీలించడానికి జీఏడీతో పాటు ఉన్నతాధికారుల కమిటీ ఉంటుంది. ఆ కమిటీ కాలపరిమితి ఎప్పుడో ముగిసింది. కొత్త కమిటీని ఇప్పటి వరకు వేయలేదు. ఈ దరఖాస్తులను పరిశీలించేవారే లేరు. ఈ పోస్టుల భర్తీ అనుమానమే.

నేరుగా రిక్రూట్‌మెంట్ చేస్తే ఎలా!

వాస్తవానికి ఆయా ప్రభుత్వ శాఖల వారీగా కారుణ్య నియామకాల కోసం వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలించి ఆ పోస్టులను మినహాయించి మిగిలిన పోస్టులను నోటిఫికేషన్‌లో చూపాల్సి ఉంటుంది. కానీ హడావుడిగా ఖాళీలను లెక్కించి సమాచారం ఇవ్వడంతో ఆ మేరకు జారీ అవుతున్న నోటిఫికేషన్ల వల్ల ఖాళీ పోస్టులు లేకుండా పోతున్నాయని ఉద్యోగ సంఘాల నేతలు చెబుతున్నారు. ఇప్పుడు పరిస్థితుల్లో శాంక్షన్ పోస్టులే చాలా తక్కువగా ఉన్నాయి. వాటిని డైరెక్టర్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేస్తే ఇక ఏండ్ల తరబడి ఖాళీలు ఉండకపోవచ్చని, ఫలితంగా కారుణ్య నియామకాలు జరగకపోవచ్చనే ఆందోళన వ్యక్తం అవుతోంది.



కురవి ఠాణాను తనిఖీ చేస్తున్న సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

పోలీసులు బాధితులకు అండగా ఉండాలి

- ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

కురవి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు బాధితులకు అండగా ఉండాలని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అన్నారు. కురవి పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన అకస్మీకంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను, సిబ్బంది యూనిఫాం, సీట్ టర్న్‌ఔట్, రిసెప్షన్, స్టేషన్‌రైటర్, ఎస్‌హెచ్‌వో, మెన్ రెస్ట్‌రూం, లాకప్ రూంలను పరిశీలించారు. తర్వాత రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బందికి ఏమైన సమస్యలు ఉన్నా పైఅధికారుల దృష్టికి తీసుకువచ్చి,పరిష్కరించుకోవాలన్నారు. దొంగతనాలు జరుగకుండా చూడాలని, బ్లూకోట్స్, పెట్రోల్‌కార్ నిరంతరం గస్తీ నిర్వహించాలన్నారు. గంజాయి, గుట్కా, గుడుంబాలపై కఠినంగా వ్యవహరించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌ను పచ్చదనం పరిమళించేలా నిర్వహిస్తున్న ఎస్సై సతీష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై పాల్గొన్నారు.



మానుకోట రైల్వేస్టేషన్‌లో నిలిచిన కోర్బా ఎక్స్‌ప్రెస్

సాంకేతిక లోపంతో నిలిచిన గూడ్స్‌రైలు

- మానుకోటలో 'కోర్బా, సింగరేణి', డోర్నకల్‌లో 'శాతవాహన' నిలిపివేత
- అప్ లైన్‌లో రైళ్ల రాకపోకలకు గంటపాటు అంతరాయం

6

పంటల వివరాలు నమోదు చేయించాలి

- జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల



పంటను పరిశీలిస్తున్న విజయనిర్మల

కేసముద్రం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ సీజన్‌లో రైతులు సాగు చేసే పంటల వివరాలను వ్యవసాయ విస్తరణాధికారుల వద్ద నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.వి జయనిర్మల కోరారు. 2024- వానాకాలం పంటల పునఃపరిశీలన కార్యక్రమంలో భాగంగా కాట్రపల్లిలో వివిధ పంటలను శుక్రవారం క్షేత్రస్థాయిలో డీఏవో సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటా వానాకాలం, యాసంగి సీజన్‌లో ప్రతీరైతు సాగుచేసే పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. దీనివల్ల ఉత్పత్తులు ప్రభుత్వరంగ సంస్థలకు విక్రయించే సమయంలో అవసరం ఉంటుందన్నారు. డీఏవోతో మండల వ్యవసాయాధికారి బి.వెంకన్న, ఏఈవో శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు

సీపీఐ శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పేదల పక్షాన నిలబడి పోరాడే భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆవిర్భవించి వందేళ్లు కావస్తున్న తరుణంలో దేశ వ్యాప్తంగా వాడవాడలా శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ వీరభవన్‌లో సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని శుక్రవారం వరిపెల్లి వెంకన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీ సీపీఐ అని, ఇప్పటి వరకు ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని పేద ప్రజల కోసం పోరాడుతుందన్నారు.రాబోయే రోజులు కమ్యూనిస్టులవేనని, వెనిజులా, శ్రీలంకలో మాదిరిగా భారత్‌లో కమ్యూనిస్టులు అధికారంలోకి రావడం తథ్యమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐని ఆదరించి గెలపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికై తొలిసారిగా మానుకోటకు వచ్చిన శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.అజయ్‌సారథి రెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, వరిపెల్లి వెంకన్న, పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, సాంబలక్ష్మి, సందీప్, రవి, శ్రావణ్, వీరన్న, రమేష్, ఎమ్డీ. మహమూద్,అశోక్, ప్రవీణ్, చిరంజీవి, స్వామి, శ్రీనివాస్, రవీందర్, బాలకృష్ణ, మహేందర్, పోలెపాక వెంకన్న పాల్గొన్నారు.

కొత్తగూడ, గంగారం మండలాలు అభివృద్ధి చేస్తా

- విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించేందుకు చర్యలు
- మహిళలకు ఉపాధి కల్పన, వడ్డీలేని రుణాలు
- రెండు పంటలకు సాగు నీరందిస్తాం
- పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క



గుండంపల్లి గ్రామంలో పర్యటిస్తున్న మంత్రి సీతక్క

కొత్తగూడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఇతర ప్రాంతాల కంటే దీటుగా కొత్తగూడ, గంగారం మండలాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నామని పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలో శుక్రవారం పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పర్యటించారు. గుండం శివాలయంలో ఆమె ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత మోకాళ్లపల్లిలో సీసీ రోడ్డు పనులను, పొగుళ్లపల్లి, ఎదుళ్లపల్లి పాఠశాలల్లో మౌరిటెక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్లను ప్రారంభించారు. ఏకలవ్య మోడల్ పాఠశాలను సీతక్క సందర్శించారు. విద్యార్థులకు నీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. దుగ్గారంలో బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆయా కార్యక్రమాల్లో మాట్లాడుతూ మండలాల్లో సీసీ, బీటీ రోడ్లను మరమ్మతు చేయిస్తున్నామన్నారు. వంతెనలు నిర్మిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని పాఠశాలల్లో సాంకేతిక విద్యాను అందించాలనే లక్ష్యంతో పాఠశాలల్లో కంప్యూటర్లను అందిస్తున్నామన్నారు. పాఠశాల్లో డిజిటల్ విద్యను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చదివించాలని సూచించారు. మహిళలకు ఉపాధి కల్పించాలని కుట్టుమిషన్‌లు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం వారికి పని కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాఠశాల యూనిఫాంలు కుట్టించి ఇచ్చేలా చర్యలు తీసుకుని ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఏజెన్సీలో రెండు పంటలకు సాగునీరు అందించాలని పాఖాలలో లిఫ్ట్ ఏర్పాటు చేసేదిశగ చర్యలు చేపట్టామన్నారు.

మండలంలోని పురాతనమైన గుండం రామక్క దేవాలయాన్ని అభివద్ధి చేస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. నిధులు తీసుకువచ్చి నాటి కాకతీయుల కాలంలో ఎలా ఉందో అలా అభివృద్ధి చేసి నాటి వైభవాన్ని తీసుకువస్తామన్నారు. గుంజేడులోని శ్రీముసలమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయిస్తున్నామన్నారు. గంగారం మండలం పూనుగొండ్లలోని పగిడిద్దరాజు ఆలయంను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్‌టొప్పో, డీఆర్‌డీవో పీడీ మధుసుదన్‌రాజ్, డీసీవో వెంకటేశ్వర్లు, తహసీల్దారు రమాదేవి, కాంగ్రెస్ పార్టీ కొత్తగూడ, గంగారం మండలాల అధ్యక్షులు వజ్జ సారయ్య, జాడీ వెంకటేశ్వర్లు, టీపీసీసీ సభ్యులు చల్లా నారాయణరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలి, డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్‌సింగ్, మాజీ ఎంపీపీలు విజయ, సరోజన, మాజీ జడ్పీటీసీలు పుష్పలత, రమ, నాయకులు బిట్ల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.



కబడ్డీ.. కబడ్డీ

ఎప్పుడూ.. ప్రజలతో మమేకమై ప్రజాపాలనలో బిజీగా ఉండే ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ విద్యార్థులతో సరదాగా గడిపారు. కబడ్డీ.. కబడ్డీ అంటూ ఆడి అందరినీ ఆశ్చర్యపరిచారు. మహబూబాబాద్ మునిసిపల్ పరిధి ఈదులపూసపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు క్రీడాదుస్తుల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కబడ్డీ ఆడి, వారిలో ఉత్తేజాన్ని నింపారు. తాను కూడా బడిలో బాగా కబడ్డీ ఆడేవాడినని, చిన్ననాటి జ్ఞాపకాలను ఎమ్మెల్యే నెమరువేసుకున్నారు.

- మహబూబాబాద్ టౌన్, (ఆంధ్రజ్యోతి)

బ్యాంకు ఖాతా నుంచి రూ. 7.69లక్షలు మాయం

- నర్సింహులపేట ఠాణాలో సైబర్ కేసు నమోదు

వివరాలు 8వ పేజీలో..

హామీలను నెరవేర్చే వరకూ పోరాటం

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య

వివరాలు 8వ పేజీలో..

రైతు భరోసాపై చేతులెత్తేసిన కాంగ్రెస్ సర్కార్

- ఆరు గ్యారంటీల అమలు వదిలి మూసీ ప్రక్షాళన అంటూ కాలక్షేపం
- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : అందరికి అన్నం పెట్టే అన్నదాతలకు రైతుభరోసా ఇవ్వడంపై కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ఆరోపించారు. రైతుబంధు ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పిన సర్కార్ ఎందుకు కివ్వడం లేదని ప్రశ్నించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలపై ఇప్పటి వరకు స్పష్టత లేదని, ఎన్నికల మేనిఫెస్టోలో సన్న, దొడ్డు ధాన్యం అని భేదం లేకుండా 500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు సన్నధాన్యానికి మాత్రమే ఇస్తామని కొర్రీలు పెడుతున్నారని, రైతు రుణమాఫీ కూడా పూర్తి స్థాయిలో కాలేదని ఆరోపించారు. మహబూబాబాద్ జిల్లాలో భారీ వర్షాలతో తీవ్రంగా పంటలు దెబ్బతిన్నాయని వారికి నష్ట పరిహారం ఎక్కడా ఇచ్చారని నిలదీశారు. ఆరు గ్యారంటీల అములును వదిలేసి హైడ్రా, మూసీ ప్రక్షాళన అంటూ కాలక్షేపం చేస్తున్నారని మండి పడ్డారు.

జిల్లా కేంద్రంలో ఇంటిగ్రేటేట్ మోడల్ మార్కెట్ నిర్మాణం పూర్తయినప్పటికి అందులో కూరగాయల వ్యాపారులకు షాపులు కేటాయించకుండా తాత్సార్యం చేస్తున్నారన్నారు. జిల్లాలో గతంలో పని చేసి అవినీతి ఆరోపణలతో బదిలీ అయిన అధికారులకే మళ్లీ ఇక్కడ పోస్టింగ్ ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, కౌన్సిలర్ ఎడ్ల వేణుమాధవ్, నాయకులు మంగలంపల్లి కన్న, జెరిపోతుల వెంకన్న, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, తేళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

క్రైం కార్నర్

ఇనుప రాడ్, బీరు సీసాతో పొడుచుకున్న యువకుడు

● ఇంటికన్నె రైల్వేస్టేషన్ సమీపంలో ఘటన

● పోలీసుల సహాయంతో 108లో ఆస్పత్రికి తరలింపు



తీవ్రంగా గాయపడిన యువకుడు

కేసముద్రం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మండలం ఇంటికన్నె రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం సాయంత్రం సుమారు 19 ఏళ్ల గుర్తుతెలియని యువకుడు ఇనుప రాడ్, బీరుసీసాను పగులగొట్టి తనకు తానే పొడుచుకున్నాడు. ఈ ఘటనను చూసిన స్థానికులు భయాందోళనకు గురై కేసముద్రం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని 108 వాహనంలో సదరు యువకుడున్ని మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించారు. సదరు యువకుడు ఇంటికన్నెలో ఏదైనా రైలు నుంచి దిగినట్లుగా భావిస్తున్నారు. ఇనుప రాడ్‌తో పొడుచుకోవడంతో పొట్టలో తలపై తీవ్ర గాయాలయ్యాయి. యువకుడిని ప్రశ్నించగా పశ్చిమబెంగాల్ పేరు తప్ప మిగతా వివరాలేమీ వెల్లడించడంలేదని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

తొర్రూరు రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి : విద్యుదాఘాతంతో పెంకుటిల్లు దగ్ధమైన ఘటన తొర్రూరు మండలంలోని వెల్లికట్టెలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం. వెల్లికట్టెకు చెందిన మన్నెం సైదమ్మ-పద్మయ్య దంపతులు సాయంత్రం సమయంలో ఆరుబయట కూర్చోని ఉండగా, ఒక్కసారిగా ఇంట్లో నుంచి మంటలు చెలరేగాయి. యువకులు సమీపంలోని నీటితో చలార్చే ప్రయత్నం చేశారు. ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, బీరువా, బంగారు వస్తువులతోపాటు, భూమి పాసుపుస్తకాలు, కుమారుల స్టడీ సర్టిఫికెట్లు, భూమి పత్రాలు మంటల్లో కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుబాటులో ఫైర్‌స్టేషన్ లేకపోవడంతో ప్రమాదాన్ని ఆదుపు చేయలేకపోయామని యువకులు తెలిపారు. కాగా, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి బాధితుడి పరామర్శించి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మండల అధ్యక్షుడు నుంచు సంతోష్, నాయకులు ధీకొండ శ్రీనివాస్, యాకన్న, ప్రతికంఠంరాజు పాల్గొన్నారు.

15 నుంచి 18 శాతం తేమ ఉన్న పత్తిని కొనుగోలు చేయాలి

కేంద్రజౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు కాటన్ అసోసియేషన్ లేఖ

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు25 : (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వాతావరణం, రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తేమశాతం 15 నుంచి 18 వరకు ఉన్న పత్తిని సీసీఐ కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్రజౌళీశాఖమంత్రి గిరిరాజ్ సింగ్‌కు తెలంగాణ పత్తి రైతుల తరఫున తెలంగాణ కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్‌రెడ్డి శుక్రవారం లేఖ రాశారు. ఇప్పటికే పత్తి సీజన్ ప్రారంభమైందని, పత్తి తీసే సమయంలో అకాల వర్షాలు పడడంతో పత్తి తేమ శాతం 15 నుంచి 18 వరకు ఉంటున్న విషయాన్ని పరిగణలోనికి తీసుకోవాలన్నారు. పత్తిలో తేమ శాతం 15 నుంచి 18 వరకు ఉంటోందని దీంతో సీసీఐ పత్తిని సేకరించలేకపోతోందని లేఖలో పేర్కొన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే... రాష్ట్రంలో వచ్చే సీజన్‌లో రైతులు పత్తి పంటను తక్కువగా సాగుచేసే అవకాశం ఉందన్నారు. ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం, అధికారులు పత్తి రైతులకు మద్దతు ఇవ్వకపోతే దాని ప్రభావం వస్త్ర పరిశ్రమపై పడే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జోక్యం చేసుకుని తేమశాతం 15 నుంచి 18వరకు ఉన్న పత్తిని సీసీఐ ఆధ్వర్యంలో ఎంఎస్‌పీ కింద కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఈ లేఖలో మంత్రి గిరిరాజ్ సింగ్‌ను బొమ్మినేని రవిందర్‌రెడ్డి కోరారు.

ముగిసిన అధికారుల హాస్టల్ నిద్ర

ములుగు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సంక్షేమ వస తి గృహాల నిర్వహణ, విద్యార్థుల పఠనా సామర్థ్యాలను తెలుసుకునేందుకు అధికారులు చేపట్టిన హాస్టల్ నిద్ర ముగిసింది. జిల్లాలోని 31వసతి గృహాలను రెవెన్యూ, పంచాయతీరాజ్, ఐసీడీఎస్ అధికారులు గురువారం రాత్రి సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసిన తర్వాత హాస్టళ్లలోనే నిద్రించారు. శుక్రవారం ఉద యం అల్పాహారం తర్వాత పరిసరాల్లో కలియదిరిగారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, అసౌకర్యాలను తెలుసుకున్నారు. అత్యవసర మరమ్మతుల కోసం వార్డెన్లకు సూచించారు. స్టడీ అవర్స్‌లో విద్యార్థుల నైపుణ్యాలను పరీక్షించారు. సరుకుల నాణ్యత, మెనూ అమలుపై ఆరా తీశారు. ఈ మేరకు రూపొం దించిన నివేదికపై శనివారం కలెక్టర్ దివాకర ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో చర్చించి సమస్యల పరిష్కారా నికి చర్యలు తీసుకోనున్నారు.

రసాభాసగా చెక్కుల పంపిణీ

● కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం

● జగనామలో గందరగోళం



వాగ్వాదం చేసుకుంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు

జనగామ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లాకేంద్రంలో శుక్రవారం జరిగిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ రసాభాసాగా మారింది. జనగామ పట్టణం, జనగామ మండలానికి సంబంధించిన 93మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు శుక్రవారం ఏర్పాటు చేశారు. చెక్కుల పంపిణీ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ కౌన్సిలర్ వాంకుడోత్ అనిత మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన తులం బంగారం హామీ ఏమైందంటూ ప్రశ్నించారు. దీంతో అక్కడే ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చారని మండిపడ్డారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు వేదిక వద్దకు దూసుకొని రావడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఇరువర్గాలను శాంతింపచేసి పక్కకు పంపించడంతో గొడవ సద్దుమణిగింది.

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్ లబ్ధిదారులకు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలోనే రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందని అన్నారు. కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాలతో పేద కుటుంబాల్లో ఆర్థిక భరోసాను కేసీఆర్ నింపారని గుర్తుచేశారు. జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్ మాట్లాడుతూ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చొరవతోనే చెక్కుల త్వరితగతిన మంజూరు అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, జనగామ పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, నాయకులు వంగాల కల్యాణి, ప్రేమలతారెడ్డి, బుచ్చిరెడ్డి, కౌన్సిలర్లు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బచ్చన్నపేటలోనూ గందరగోళం

బచ్చన్నపేట: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ విషయమై శుక్రవారం బచ్చన్నపేటలో గందరగోళం నెలకొంది. మధ్యాహ్నం బచ్చన్నపేట రైతువేదికలో చెక్కుల పంపిణీ ఉంటుందని, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరవుతారని రెవెన్యూ అధికారులు లబ్ధిదారులకు సమాచారమిచ్చారు. మంజూరైన 42మంది అక్కడికి చేరుకున్నారు. చెక్కులు పంచే సమయానికి ప్రోగ్రాం వాయిదా పడిందని, ఎమ్మెల్యే రావడం లేదంటూ అధికారులు వెళ్లిపోయారు. దాంతో సగానికి పైగా లబ్ధిదారులు ఇళ్లకు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో తహసీల్దార్ కార్యాలయంకు చేరుకున్నారు. ఎమ్మెల్యే రావటం లేదని ఎవరు సమాచారమిచ్చారంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. చెక్కులు పంచాల్సిందేనంటూ పట్టుబట్టారు. దీంతో అధికారులు సిద్ధమవుతుండగానే ఎమ్మెల్యే చేరుకున్నారు. కార్యాలయం ఎదుటే నిలబడి లబ్ధిదారులకు అందించారు. తాను ఇక్కడికి రావటం లేదని తప్పుడు సమాచారం ఇవ్వటం ఎంత వరకు సమంజసమని అధికారులను ప్రశ్నించారు. మంత్రి హాజరవుతారని చెబితే, తాను ఆహ్వానించేందుకు సిద్ధమని తెలిపారు. గందరగోళ పరిస్థితులు కల్పించి లబ్ధిదారులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహిపాల్‌రెడి, పీఏసీఎస్ చైర్మెన్ పులిగిళ్ల పూర్ణచందర్ పాల్గొన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఇర్రి రమణారెడ్డి, గంగం సతీష్‌రెడ్డి, బోడిగం చంద్రారెడ్డి, దూడల కనకయ్యగౌడ్, కల్లూరి అనిల్‌రెడ్డి, మద్దికుంట రాధ, బావండ్ల కృష్ణంరాజు, మునిసిఖ రాజుగౌడ్, ఎండీ షబ్బీర్ పాల్గొన్నారు.

'ఈ-నామ్' బంద్

● నాలుగు రోజులుగా కేసముద్రం మార్కెట్లో అంతా మ్యాన్యువల్

● అవకతవకలకు ఆస్కారం



మార్కెట్లో ధాన్యం తూకం వద్ద మాన్యువల్ తూకం చీటిని రాస్తున్న దడువాయి

కేసముద్రం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మార్కెట్లలో నాలుగు రోజులుగా ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ (ఈ-నామ్) వ్యవస్థ పనిచేయడంలేదు. 'ఈ-నామ్'లో నేషనల్ ఇన్ఫార్మాటిక్ సెంటర్ (ఎన్ఐసీ)తో సాఫ్ట్‌వేర్ అనుసంధాన సమస్యతో ఈనెల 22 నుంచి దేశవ్యాప్తంగా పనిచేయడంలేదని సంబంధిత సాంకేతిక అధికారులు తెలిపారు. ఫలితంగా పూర్తిగా ఈ-నామ్ ఆధారంగా నిర్వహించే కేసముద్రం లాంటి మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ-నామ్ విధానంలో తొలుత సరుకు మార్కెట్‌కు రాగానే గేట్ ఎంట్రీలో 'లాట్ ఐడీ' జారీ చేయడం, ఈ లాట్‌ఐడీ ఆధారంగా సరుకు ధరలను 'ఈ-వేలం'లో వ్యాపారులు నమోదు చేయడం, 'విన్నర్ లీస్ట్' విడుదల, ఆ తర్వాత సరుకుల తూకాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, తక్‌పట్టీ జారీ చేయడం ప్రక్రియ అంతా పూర్తిగా ఈ-నామ్‌లోనే నిర్వహిస్తున్నారు.

ఈ-నామ్ వ్యవస్థ పనిచేయకపోవడంతో అంతా మ్యాన్యువల్ విధానాలను అనుసరించాల్సివస్తోంది. సరుకులకు మ్యాన్యువల్‌గా వరుస సంఖ్యలను జారీ చేస్తున్నారు. ఈ వరుస సంఖ్య ఆధారంగా వ్యాపారులు తమ సంస్థ లెటర్‌ప్యాడ్‌పై ధరలను నమోదు చేసి మార్కెట్‌కు ఇస్తున్నారు. ఇలా ఇచ్చిన ధరల్లో ఎవరి ధర ఎక్కువ ఉంటే వారికి సరుకు కేటాయిస్తున్నారు. తూకం వద్ద దడువాయిలు 'వేయింగ్ ఇంటిగ్రేషన్ మిషన్'కు బదులుగా మ్యాన్యువల్‌గా చీటీలను రాస్తున్నారు. ఈ తూకం చీటీల ఆధారంగా తక్‌పట్టీలను రాసి ఇస్తున్నారు.

అయితే మార్కెట్‌కు అన్నిరకాల సరుకులు కలిపి గత నాలుగు రోజులుగా నిత్యం తక్కువగా 1400 నుంచి 1700 బస్తాల వరకే సరుకుల రాబడులు ఉండడంతో మ్యాన్యువల్‌గా నిర్వహణ సులువుగా కొనసాగుతోంది. మ్యాన్యువల్ విధానంలో అవకతవకలకు ఆస్కారం కూడా ఉంది. సరుకుల రాబడులు అధికంగా ఉంటే ఈ-నామ్ లేకుండా మార్కెట్‌ను నిర్వహించడం కష్టతరంగా మారేది. మరోవైపు నాలుగు రోజులుగా ఈ-నామ్‌లోని సాంకేతిక సమస్యను సరిచేయకపోవడంపై పలువురు రైతులు, వ్యాపారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ-నామ్ సాంకేతిక సమస్యను పరిష్కరించి వ్యవస్థను త్వరితగతిన సరిచేయాలని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.

సాంకేతిక లోపంతో నిలిచిన గూడ్స్‌రైలు

మానుకోటలో 'కోర్బా, సింగరేణి' దోర్నకల్‌లో 'శాతవాహన' నిలిపివేత

అప్ లైన్‌లో గంటపాటు అంతరాయం

కేసముద్రం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం-తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ల మధ్య శుక్రవారం ఉదయం గూడ్స్‌రైలు నిలిచిపోవడంతో అప్‌వైపు వెళ్లే రైళ్లకు ఆటంకం ఏర్పడింది. మహబూబాబాద్ నుంచి కేసముద్రం వైపునకు బయలు దేరిన ఓ గూడ్స్‌రైలు తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ దాటి న అనంతరం రంగాపురం రైల్వేగేటు సమీపంలో ఉదయం 8.15 గంటల ప్రాం తంలో 428 కిలోమీటరు వద్ద సాంకేతిక లోపంతో నిలిచిపోయినట్లు రైల్వే సిబ్బం ది తెలిపారు.

ఇదే ట్రాక్‌లో వెనుకవైపున వస్తున్న పలు రైళ్లను వివిధ రైల్వేస్టేషన్లలో నిలిపివేశారు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో త్రివేండ్రం సెంట్రల్ నుంచి కోర్బాకు వెళ్లే కోర్బా (22648) ఎక్స్‌ప్రెస్, భద్రాచలం రోడ్ నుంచి బల్లార్షకు వెళ్లే సింగరేణి మెము (17033) ఎక్స్‌ప్రెస్, డోర్నకల్‌లో విజయవాడ నుంచి సికింద్రాబాద్ జంక్షన్‌కు వెళ్లే శాతవాహన సూపర్ ఫాస్ట్ (12713) ఎక్స్‌ప్రెస్‌లు నిలిపివేశారు. మరో ఇంజన్‌ను తెప్పించి ఈ గూడ్స్‌రైలుకు జత చేసి కేసముద్రం వైపునకు రైలును తరలించి లైన్ క్లియర్ చేశారు. అనంతరం వివిధ రైల్వేస్టేషన్లో నిలిచిన ఎక్స్‌ప్రెస్ రైళ్లలన్నీ ఒకదాని తర్వాత మరొకటి యధావిధిగా ముందుకు సాగాయి. ఈ ఘటన ఫలితంగా మహబూబాబాద్ నుంచి డోర్నకల్, తదితర రైల్వేస్టేషన్లలో సుమారు గంటపాటు అప్‌వైపు రైళ్లు నిలిచిపోయాయి.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

సీపీ అంబర్ కిశోర్ ఝా



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

హనుమకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అధికారులు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని వరంగల్ పోలీసు కమిషనర్ పోలీసు అధికారులను హెచ్చరించారు. శుక్రవారం నెలవారీ నేర సమీక్షలో భాగంగా వరంగల్ పోలీసు కమిషరేట్ కార్యాలయంలో సమీక్షా సమావేశం జరిగింది. డీసీపీ, ఏసీపీ, ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్న ఈ సమావేశంలో ముందుగా పోలీసు కమిషనర్ పెండింగ్ కేసులు నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తదితర అంశాలపై సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీసు కమిషనర్ పలు సూచనలు చేస్తూ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే కార్యకలాపాలపై స్టేషన్ అధికారులకు ముందస్తు సమాచారం ఉండాలని, సోషల్ మీడియాలో ప్రచారం అయ్యే కథనాలపై అధికారులు దృష్టి సారించాలని అలాగే వదంతులు వ్యాప్తి చేసే వ్యక్తులు, సంస్థలపై కన్నేసి ఉంచాలని సీపీ సూచించారు.

శాంతి భద్రతల అంశంపై పోలీసు కమిషనర్ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు ప్రతీ పోలీసు స్టేషన్ పరిధిలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, ముఖ్యంగా రాత్రి సమయాల్లో మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, బాధితుల నుంచి ఫిర్యాదులతో పాటు, సీపీ కార్యాలయం ద్వారా వచ్చే ఫిర్యాదులపై వేగంగా స్పందిస్తూ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన టాస్క్‌ఫోర్స్, యాంటీ డ్రగ్స్ విభాగానికి పోలీసు కమిషనర్ చేతుల మీదుగా రివార్డులు అందచేశారు. ఈ సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, రవీందర్, రాజమహేంద్ర నాయక్, అదనపు డీసీపీ రవితో పాటు ఏసీపీలు ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పోరాటాలను ఉధృతం చేయాలి

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు రవికుమార్



మాట్లాడుతున్న రవికుమార్

గోవిందరావుపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా నాయకులు, కార్యకర్తలు పోరాటాలను ఉధృతం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ కోరారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని పస్రాలో శుక్రవారం సీపీఎం 8వ మండల మహాసభ గుండు రామస్వామి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ఇటీవల మరణించిన అమరవీరులకు సంతాప సూచికంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం మహాసభలో రవికుమార్ మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఎరువులు, ఆహార సబ్సిడీలు, ఉపాధిహామీ పథకంలో గతంలో కంటే కోతలు విధించిందని విమర్శించారు. నిరుద్యోగాన్ని పెంచే విధానాలను వేగవంతంగా అమలుచేస్తోందని దుయ్యబట్టారు.

రైల్వేలో రిటైర్ అయిన ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలో తీసుకునే విధానాన్ని వాడుకలోకి తీసుకొచ్చిందని అన్నారు. దేశ రక్షణలో కీలకంగా ఉండే సైనిక వ్యవస్థను సైతం నీరుగార్చేలా నాలుగేళ్ల సర్వీసు విధానాన్ని అమలులోకి తెచ్చిందని ఆరోపించారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన అనేక హామీలను నెరవేర్చి కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పథకాలను రాబట్టేందుకు నాయకులు, కార్యకర్తలు పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. మహాసభలో జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు బీరెడ్డి సాంబశివ, పొదిళ్ల చిట్టిబాబు, నాయకులు రత్నం రాజేందర్, తీగల ఆగిరెడ్డి, కొప్పుల రఘుపతి, గొంది రాజేష్, సోమ మల్లారెడ్డి, నాగరాజు, అంబాల మురళి పాల్గొన్నారు.



మార్కెట్ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

మార్కెట్ బైలా ప్రకారమే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు25: (ఆంధ్రజ్యోతి) : ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో మార్కెట్ బైలా ప్రకారమే వ్యాపార కార్యకలాపాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతు సంఘం ప్రతినిధులతో కలిసి శుక్రవారం మార్కెట్ కార్యదర్శి పోలెపాక నిర్మలకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మోర్తాల చందర్‌రావు మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి పంటను సీసీఐ ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలన్నారు. తేమ పేరుతో సీసీఐ కొనుగోలు చేయపోవడంతో ప్రయివేటు వ్యాపారస్తులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి రైతును నష్టాల పాలు చేస్తున్నారని ఆరోపించారు. అదే విధంగా పత్తిపంటకు మద్దతు ధర క్వింటాల్‌కు రూ.11 వేలు ధర నిర్ణయించాలని డిమాండ్ చేశారు. రైతుల గన్నీబ్యాగులకు వ్యాపారులు రూ.60ల చొప్పున చెల్లించాలని, మార్కెట్ సజావుగా సాగేందుకు వీలుగా ఉద్యోగుల ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాషపాక రమేష్, బల్లుకూరి నర్సయ్య, కూన సంపత్, వజ్ర శ్రీనివాస్, మోర్తాల రవిందర్, గోనె లింగమూర్తి, పెంతల రాజు, ముత్యాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎస్ఆర్‌సీ సభ్యుల పర్యటన



కాటారం పీహెచ్‌సీ వద్ద వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో ఎన్‌హెచ్‌ఎస్ఆర్‌సీ బృందం

కాటారం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్ సిస్టం రిసోర్స్ సెంటర్ (ఎన్‌హెచ్‌ఎస్ఆర్‌సీ) సభ్యులు భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో శుక్రవారం పర్యటించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, బయ్యారం సబ్‌సెంటర్‌లోని ఆయు ష్మాన్ ఆరోగ్యమందిరాన్ని సందర్శించారు. పీహెచ్‌సీ, సబ్‌సెంటర్‌లో అందుతున్న వైద్యసేవల తీరు, ఏఎన్‌సీ సేవలు, ఇమ్యు నైజేషన్, ఎన్‌సీడీ, అత్యవసర మందుల సరఫరా వివరాలను బృందం సభ్యులు కన్నన్, విజయలక్ష్మి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీదేవి, డీపీవో చిరంజీవి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మౌనిక, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాంక, హెచ్ఎస్ పద్మావతి, హెచ్‌ఏ రాజు, ఏఎన్ఎంలు లక్ష్మి, రజిత, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

గణపురంలో..

గణపురం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రా థమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎన్‌హెచ్‌ఎస్ఆర్‌సీ సభ్యులు తనిఖీ చేశారు. ఇండియన్ పబ్లిక్ హెల్త్ సర్వీసెస్ నిబంధనల ప్రకారం ఆస్పత్రి నిర్వహణ, అందిస్తున్న సేవలు, ఇంకా మెరుగు పరచాల్సిన సౌకర్యాలను బృందం సభ్యులు కర్ణన్, విజయలక్ష్మి, అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో మధుసూదన్, ప్రోగాం ఆఫీసర్ శ్రీదేవి, డీడీఎం మధుబాబు, ఎపిడమిక్ అధికారి భాష్యనాయక్, డీపీ వో చిరంజీవి తదితరులు తదితరులు ఉన్నారు.

వివక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలి

» ప్రభుత్వాలను గద్దె దింపిన చరిత్ర పీడీఎస్‌యూది

» ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే

» ఘనంగా పీడీఎస్‌యూ 50 ఏళ్ల పోరాట స్ఫూర్తి సభ



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబర్ 24(ఆంధ్రజ్యోతి) : సమాజంలోని వివక్ష, అసమానతలకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలని ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే అన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ)50 ఏళ్ల పోరాట స్ఫూర్తి సభ హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియం ఆవరణలో శుక్రవారం పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముందుగా పీడీఎస్‌యూ నాయకులు బాలసముద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ సార్ పార్కు నుంచి వేలాది మంది విద్యార్థులతో స్ఫూర్తిప్రదర్శనగా కాళోజీ జంక్షన్, అమరవీరుల జంక్షన్, సుబేదారి మీదుగా ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం వరకు వచ్చారు.

అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే మాట్లాడుతూ.. పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం 70వ దశకంలో స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, సమానత్వం కోసం ప్రపంచవ్యాప్తంగా పోరాడుతున్న విద్యార్థి ఉద్యమాల స్ఫూర్తితో 1974లో ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్‌ల నాయకత్వంలో ఏర్పడి విద్యార్థుల సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రైవేట్ రంగంలో మెడికల్ కాలేజీల ఏర్పాటును వ్యతిరేకించి ప్రభుత్వాలను గద్దె దింపిన చరిత్ర పీడీఎస్‌యూకు ఉందన్నారు.

ప్రొఫెసర్ కె. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. పేద, దళిత, గిరిజన వెనుకబడిన, అణగారిన వర్గాల విద్యార్థుల మెస్‌ఛార్జీలు, స్కాలర్‌షిప్‌ల కోసం పీడీఎస్‌యూ రాజీలేని పోరాటాలు చేసిందన్నారు. ప్రొఫెసర్ సీ.హెచ్ దినేష్ కుమార్, పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ ఎం. రామకృష్ణ, ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి, ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి ప్రతాప్‌రెడ్డి, పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నున్న అప్పారావు, పీడీఎస్‌యూ జాతీయ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఈడంపాక విజయ్‌ఖన్నా, పీడీఎ స్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సాంబ, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.సరళ, పీడీఎస్‌యూ నాయకులు సతీష్, గణేష్, సైదులు, అర్జున్, మిశ్రిన్ సుల్తానా, రాచకొండ రంజిత్‌తోపాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీ రకం)	2505	2080
పల్లికాయ (సూక)	6000	5000
పల్లికాయ (పచ్చిది)	4600	4000
కందులు	7000	6900
పెసళ్లు	6400	4052
పత్తి	7000	5500
కొత్తపత్తి	---	---
పసుపు (కాడి)	---	---
పసుపు (గోల)	---	---
తేజ మిర్చి	12500	9000
తేజ ఏసీ	17000	12000
వండర్‌హాట్ ఏసీ	15000	11000
యూఎస్341ఏసీ	15000	11000
దేశీ ఏసీ	---	---
సింగిల్‌పట్టి ఏసీ	---	---
తాలు మిర్చి	8000	3000

- వరంగల్ వ్యవసాయం

ఆలయ దర్శనం

హేమాచల క్షేత్రం ఆధ్యాత్మిక సౌరభం





హేమాచల క్షేత్ర ముఖద్వారం

గర్భాలయంలోని స్వామివారి మూలవిరాట్

తిరుమలను తలపించే కొండకోనలు

ప్రకృతి అందాల మధ్య వేంచేసిన లక్ష్మీనృసింహుడు

గుహాంతర్భాగంలో కొలువైన స్వామివారు

పలు ఉప దేవాలయాల దర్శనంతో పరవశిస్తున్న భక్తులు

అభివృద్ధి, పర్యాటక కేంద్రంగా గుర్తింపు కోసం ఎదురుచూపు

మంగపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చుట్టూ పచ్చని చెట్లు. ఎత్తైన కొండలు. గలగలాపారే సేలయేర్లు. తిరుమల ఏడుకొండలను తలపించేలా ఆహ్లాదకర వాతావరణంతో పాటు మనసునిండా ఆధ్యాత్మిక సౌరభాలను వెదజల్లుతోంది హేమాచలక్షేత్రం. స్వయంభువుగా వెలిసిన లక్ష్మీనర్సింహస్వామి విగ్రహం, చుట్టూ ఆరు ఉప దేవాలయాలతో వర్ధిల్లుతోంది ఈ చారిత్రత్మక పుణ్యక్షేత్రం. ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు హేమాచలకొండలపై గుహాంతర్భాగంలో వేంచేసిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత స్వయంభు పుట్టుస్వామి.. భక్తుల కొంగుబంగారంగా ఆశీస్సులందిస్తున్నారు. ఆలయానికి ఓ వైపు ఆదిపరాశక్తి ధైతమాత విగ్రహం దర్శనమిస్తుండగా.. మరోవైపు ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి పేరిట చింతామణి జలధారల నుంచి నిత్యం స్వచ్ఛమైన నీరు వస్తుంది. ఈ నీటిలో స్నానాలు చేయడం, 41 రోజుల పాటు పరగడుపున, రాత్రి నిద్రపోయే ముందు తాగడం ద్వారా అనారోగ్య సమస్యలు దూరమవుతాయని భక్తులు నమ్ముతారు. ఇక గుహ అంతర్భాగంలో 8అడుగుల ఎత్తులో నరసింహ అవతారంలో స్వామివారు దర్శనమిస్తుంటారు. చింతామణి జలధారలకు పర్లాంగు దూరంలో ఎద్దుముక్కు ఆంజనేయస్వామి, గుట్ట పాత కాలి బాటన కిలో మీటరు దూరంలో శిఖాంజనేయా స్వామి దేవాలయాలున్నాయి. ఈ హేమాచలకొండలు అర్ధ చంద్రాకారంలో చూపరులను ఆకట్టుకొంటున్నాయి. తిరుమల తరహాలో ఇక్కడ వేసవికాలంలోనూ చల్లగా ఉంటుంది. ఎంతో ప్రాముఖ్యం కలిగిన ఈ క్షేత్రం అభివృద్ధిపై ప్రభుత్వాలు పట్టించుకోకపోవడాన్ని భక్తులు ఆక్షేపిస్తున్నారు. నిత్యం ఈ దేవాలయానికి తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగున గల ఛత్తీ్‌సగఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి భక్తులు తరలొచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ క్రమంలో విడిది చేసేందుకు ప్రత్యేక భవనాలు వసతులు లేవు. అడవి కొండ ప్రాంతం కావడంతో భక్తులకు రాత్రి వేళల్లో రక్షణ ఉండటం లేదు. 2017కు ముందు దుకాణాల సముదాయంతో ఆలయం కళకళలాడుతూ కన్పించేది. ఇప్పుడు ఆ షాపుల వేలం విషయంలోనూ వివాదాలే ఉన్నాయి. దాంతో వేలం పాటలు జరగక రూ.లక్షల్లో ఆదాయం కోల్పోయే పరిస్థితి. గుడి ఆదాయం విషయంలో గిరిజన, గిరిజనేతర వివాదాలు తీవ్ర అడ్డంకిగా మారాయి. ఈ నేపథ్యంలో దేవస్థానం అధికారులు కేవలం పులిహోర, లడ్డూ ప్రసాదాలు మాత్రమే సిబ్బందితో తయారు చేయించి విక్రయిస్తున్నారు. ఈ విక్రయాలలో కూడా భక్తులకు సరిగా ప్రసాదాలు అందక నిరుత్సాహం చెందుతున్నారు.

పర్యాటక కేంద్రంగా ప్రకటించాలి

ప్రకృతి సుందరమైన ఈ ప్రాంతాన్ని రాష్ట్ర ప్రభుత్వం పర్యటక కేంద్రంగా ప్రకటించి వసతి, రవాణా సౌకర్యాలు కల్పించాలని ఈ ప్రాంత ప్రజలు, భక్తులు కోరుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు మల్లూరుకు చేరుకుని అక్కడి నుంచి కొండపైకి ఐదు కిలో మీటర్ల వరకు ప్రైవేట్ వాహనాల్లో అధిక చార్జీలతో వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. కొండపైకి రహదారి సౌకర్యం ఉన్నా, ఆర్టీసీ బస్సుల్లేకపోవడం సాధారణ, మధ్యతరగతి భక్తులకు భారంగా మారింది. ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన ఈ పురాతన దేవాలయంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించక పోవడంతో భక్తులు ప్రభుత్వం తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.



స్వచ్ఛమైన చింతామణి జలధార

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి



యెర్రంకాని వీరన్‌కుమార్, మల్లూరు

పూర్వ కాలం నుంచి పేరుగాంచిన ఈ దేవస్థానం అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలి. భక్తులకు ఆలయ పరిసరాలతో పాటు ఆలయ దర్శనాలు, రవాణా, వసతి సౌకర్యాలు కల్పించాలి. ఆలయానికి వచ్చే ఆదాయాన్ని కోల్పోకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలి.

వివాదాలు తొలగాలి



దీకొండ నర్సింహరావు, బోరునర్సాపురం, భక్తుడు

దేవస్థానం విషయంలో ఉన్న పలు వివాదాలు, కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు తొలగాలి. అప్పుడే భక్తుల ఇబ్బందులను తొలగుతాయి. దేవస్థానం అధికారులు, అర్చక, ఉద్యోగులు భక్తులకు ఎలాంటి అవకతవకలు లేకుండా చూస్తూ, భక్తులకు సౌకర్యాలు కల్పించాలి.

కోర్టు తీర్పు పెండింగ్‌తో ఇబ్బందులు

శ్రవణపు సత్యనారాయణ, మల్లూరు దేవస్థానం ఈవో

గతంలో ఆలయం సజావుగా జరిగేది. దేవస్థానం విషయం కోర్టుకు వెళ్లిన తర్వాత ఆదాయం సరిగా సమకూరడం లేదు. కోర్టు తీర్పు వెలుడినా, లేకున్నా, తమశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సక్రమంగానే అందరి సహాయ సహకారాలతో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకొంటున్నాం.



హేమాచల క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం

వైభవంగా ముగిసిన సహస్ర చండీయాగం

- పూర్ణాహుతికి వేలాది మంది భక్తుల రాక
- దేవాదాయ శాఖ ఏసీ, ప్రముఖుల హాజరు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం ఐదు రోజుల పాటు 80 మంది రుత్వికులచే అత్యంత వైభవంగా నిర్వహించిన సహస్ర చండీయాగం శుక్రవారం మహా పూర్ణాహుతితో ముగిసింది. నగరంలోని రామన్నపేట పోతన రోడ్డులో గల మణిద్వీప్ గార్డెన్‌లో జరిగిన సహస్ర చండీయాగాన్ని కర్ణాటక రాష్ట్రం ఉడిపికి చెందిన సామవేద పండితులు బ్రహ్మశ్రీ శ్రీకాంత్ అడిగ నేతృత్వంలో జరిగిన సహస్ర చండీయాగానికి దాదాపు 50 హోమ గుండాలను ఏర్పాటు చేసి 80 మంది రుత్వికులచే వేద పారాయణం జరిపించారు. ఆఖరి రోజు శుక్రవారం మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఈసందర్భంగా మహిళా భక్తమండలి ఆధ్వర్యంలో 500 మంది మహిళలు ఐదు రోజుల పాటు సామూహికంగా శ్రీలలిత సహస్ర నామ పారాయణం, శ్రీగీతా పారాయణాన్ని నిర్వహించారు. ఈ మహా పూర్ణాహుతి కార్యక్రమానికి దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ రాయల సునిత, చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపారులు, వైశ్య సంఘం ప్రతినిధులతో పాటు చింతాకుల సునిల్, చింతాకుల అనిల్, పడిశాల సుజాత, ప్రముఖ అర్చకులు, మహిళా మండళ్లు, భక్తులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేలాది మందికి మహా అన్నదానం నిర్వహించారు.



చండీయాగం పూర్ణాహుతిలో పాల్గొన్న భక్తులు

సౌత్ జోన్ పురుషుల బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక


కేయూక్యాంపస్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని చెన్నై ఎస్ఆర్ఎం ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఈనెల 26 నుంచి 29 వరకు జరిగే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ పురుషుల బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు కాకతీయ యూనివర్సిటీ జట్టు ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య శుక్రవారం ప్రకటించారు. ఎంపికైన వారిలో పి.సాయి అరవింద్, (వాగ్దేవి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, బొల్లికుంట), జి.మోహన్‌దాస్, జి.శృతి, ఎం.వేణు(వాగ్దేవి డిగ్రీ కళాశాల, హనుమకొండ), వి.రుపాక్ రామన్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రంగశాయిపేట), కె.తులసి దాస్(మహర్షి డిగ్రీ కళాశాల, ములుగు), సీహెచ్.సాయికృష్ణ, (కిట్స్ కళాశాల, హసన్‌పర్తి)లు ఎంపికైనట్లు వెంకయ్య తెలిపారు. జట్టుకు మేనేజర్‌గా బొల్లికుంటలోని వాగ్దేవి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ యు.రవీందర్ వ్యవరిస్తారు. ఎంపికైన జట్టును కేయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి,స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు అభినందించారు.



ఎంపికైన బ్యాడ్మింటన్ జట్టు క్రీడాకారులు

అల్లు అర్జున్ పిటిషన్‌పై
6న నిర్ణయం వెల్లడిస్తాం

- అప్పటివరకు ఎఫ్ఐఆర్ ఆధారంగా తదుపరి చర్యలు వద్దు: ఏపీ హైకోర్టు
- అది ఎన్నికల కోడ్ ఉల్లంఘన కాదు: అల్లు అర్జున్ తరఫు న్యాయవాది



అమరావతి, అకోబరు 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారంటూ నంద్యాల పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ సినీనటుడు అల్లు అర్జున్, వైసీపీ మాజీ ఎమ్మెల్యే రవిచంద్రకిశోర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఇరువైపుల వాదనలు ముగియడంతో నవంబర్ 6న నిర్ణయం వెల్లడిస్తామని న్యాయస్థానం ప్రకటించింది. అప్పటివరకు ఎఫ్ఐఆర్ ఆధారంగా తదుపరి చర్యలు అన్నింటినీ నిలిపేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. విచారణ సందర్భంగా పిటిషనర్ల తరఫున న్యాయవాది వై.నాగిరెడ్డి వాదనలు వినిపించారు. అల్లు అర్జున్ పర్యటన పూర్తి వ్యక్తిగతమని, స్నేహం కారణంగానే కిశోర్‌రెడ్డిని అభినందించేందుకు ఈ ఏడాది మే11న నంద్యాల వెళ్లారని చెప్పారు. అల్లు అర్జున్ వచ్చాడని తెలిసి ఆయన ఫ్యాన్స్ కిశోర్‌రెడ్డి ఇంటి వద్దకు వచ్చారన్నారు. ఇది ఎన్నికల నియమావళి ఉల్లంఘన కాదని, పిటిషనర్లపై డిప్యూటీ తహశీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు చెల్లుబాటు కాదన్నారు. పోలీసుల తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్పందిస్తూ.. కేసులో పోలీసులు ఇప్పటికే చార్జిషీట్ దాఖలు చేశారన్నారు. అయితే ట్రయల్ కోర్టు ఇంకా నంబర్ కేటాయించలేదన్నారు. ఈ నేపథ్యంలోనే వై.నాగిరెడ్డి స్పందిస్తూ.. ట్రయల్ కోర్టు చార్జిషీట్‌ను కాగ్నిజెన్స్‌లోకి తీసుకోలేదన్నారు. క్వాష్ పిటిషన్‌పై నిర్ణయం వెల్లడించేవరకు ఎఫ్ఐఆర్ ఆధారంగా తదుపరి చర్యలన్నింటినీ నిలువరిస్తూ ఉత్తర్వులివ్వాలని అభ్యర్థించారు. అందుకు అంగీకరించిన న్యాయమూర్తి.. పిటిషన్‌పై నవంబర్ 6న నిర్ణయం వెల్లడిస్తామన్నారు.

నేడు, రేపు సింహపురి ఎక్స్‌ప్రెస్ రద్దు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : శని, ఆదివారాల్లో సికింద్రాబాద్-గూడూరు మధ్య నడిచే సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలును రద్దు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే ప్రకటించింది. శనివారం నాడు సికింద్రాబాద్ నుంచి బయల్దేరే(12710) రైలును రద్దు చేయగా, ఆదివారం గూడూరు నుంచి సికింద్రాబాద్‌కు వచ్చే(12709) రైలు కూడా రద్దయినట్లు అధికారులు పేర్కొన్నారు. దానా తుపాను కారణంగా హౌరా నుంచి సికింద్రాబాద్‌కు రావాల్సిన ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రద్దు కావడమే ఇందుకు కారణమని చెబుతున్నారు. ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌కు కనెక్టింగ్ రైలు కావడంతో సింహపురి ఎక్స్‌ప్రెస్ నడిపేందుకు రేక్ కొరత ఏర్పడినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలు రద్దు నేపథ్యంలో ఆయా రోజుల్లో రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు పూర్తి సొమ్ము వాపసు చేయనున్నట్లు తెలిపారు.

ఆసిఫాబాద్ ఎమ్మెల్యేకు హైకోర్టులో ఊరట

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవా లక్ష్మికి హైకోర్టులో ఊరట లభించింది. ఆమె ఎన్నిక చెల్లదని పేర్కొంటూ, కాంగ్రెస్ నేత అజ్మీరా శ్యాం దాఖలు చేసిన ఎలక్షన్ పిటిషన్‌ను హైకోర్టు శుక్రవారం కొట్టేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆసిఫాబాద్ నుంచి కాంగ్రెస్ తరఫున పోటీచేసిన అజ్మీరా శ్యాం బీఆర్ఎస్ అభ్యర్థి కోవా లక్ష్మి చేతిలో ఓటమిపాలయ్యారు. లక్ష్మి తన ఎన్నికల అఫిడవిట్‌లో ఆదాయపు పన్ను వివరాలను దాచిపెట్టారని, అందువల్ల ఆ ఎన్నికను రద్దు చేయాలని కోరుతూ ఆయన ఎలక్షన్ పిటిషన్ (ఈపీ) దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం.. కేసులో మెరిట్స్ లేకపోవడంతో కొట్టేస్తున్నట్లు ప్రకటించింది.

వణికిస్తున్న చలి పులి..!

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చలి ప్రభావం మొదలైంది. కొన్ని జిల్లాల్లో రాత్రిపూట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. బుధవారం రాత్రి సంగారెడ్డి, వికారాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఉష్ణోగ్రత 16 డిగ్రీలకు చేరుకుంది. మరో డిగ్రీ తగ్గితే చలి తీవ్రతకు యెల్లో అలెర్ట్ జారీ చేస్తారు. అక్టోబరు చివరివారంలోనే ఇలా ఉంటే ముందు ఇంకెలా ఉంటుందోనని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. రాగల మూడ్రోజులు కనిష్ఠ ఉష్ణోగ్రతలు 17-22 డిగ్రీల మధ్య నమోదవుతాయని, పగటిపూట గరిష్ఠ ఉష్ణోగ్రతలు 30-33 డిగ్రీల మధ్య నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

నాన్న ఆదేశించారు..
అమ్మ వెయ్యిసార్లు చెప్పింది

అవన్నీ కుటుంబ ఆస్తులే.. నా సోదరుడు జగన్ గార్డియన్ మాత్రమే.. నా బిడ్డలకు రావాల్సిందే అడుగుతున్నా

- కొడుకు నిర్వాకంతో తల్లి క్షోభిస్తోంది
- వైఎస్ అభిమానులకు షర్మిల బహిరంగ లేఖ



అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వైఎస్ రాజశేఖరరెడ్డి స్థాపించిన అన్నివ్యాపారాలూ కుటుంబ వ్యాపారాలేనని, అందులో తన నలుగురు మనవలు, మనవరాళ్లకు సమానవాటా ఉండాలన్నది ఆయన ఆదేశమని, అమ్మ కూడా కనీసం వెయ్యిసార్లు ఇదే విషయం చెప్పారని వారి కుమార్తె, ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. వ్యాపారాలకు, ఆస్తులకు తన సోదరుడు జగన్ గార్డియన్ మాత్రమేనన్నారు. ఆస్తులు ఎగ్గొట్టడానికి కన్న కొడుకే కేసులు పెట్టి కోర్టుకు లాగడంతో తన తల్లి విజయలక్ష్మి క్షోభకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్రంలోని వైఎస్ అభిమానులకు శుక్రవారం ఆమె బహిరంగ లేఖ రాశారు. గత కొద్దిరోజులుగా వైఎస్ కుటుంబ ఆస్తుల గొడవల నేపథ్యంలో షర్మిలను నిందిస్తూ జగన్ పత్రిక శుక్రవారం సంచికలో ఒక కథనం ప్రచురించింది. ఈ కథనాన్ని ఖండించడంతోపాటు వైఎస్ అభిమానులకు వాస్తవాలు తెలియాలని లేఖ రాస్తున్నట్టు ఆమె తెలిపారు. జగన్ పత్రిక శుక్రవారం సంచికలో వండి వార్చిన అబద్ధపు కథనంలో తెలిపినట్టు... వైఎస్ బతికుండగా ఏ ఒక్క ఆస్తి పంపకమూ జరగలేదని, ఈరోజుకూ న్యాయంగా రావాల్సిన ఒక్క ఆస్తి కూడా తన చేతుల్లో లేదన్నారు. వైఎస్ కుటుంబ కంపెనీల్లోని వాటాలను పంచుకోవడం వల్ల జగన్ బెయిల్‌కు వచ్చిన ముప్పేం లేదని, అది రద్దయ్యే అవకాశం ఉండబోదన్నారు. ఇంకా షర్మిల ఏమన్నారంటే.. 'మా నాన్న గురించి అమ్మ ఒక పుస్తకం రాసింది. అందులో.. రాజశేఖరరెడ్డికి లోకమంతా ఒక ఎత్తయితే.. షర్మిల ఒక ఎత్తు అంటూ రాశారు. ఆడపిల్లను అని నన్ను ఆయన ఎన్నడూ చిన్నచూపు చూడలేదు. ఆయన బతికున్నంతకాలం తనకు మనవడు, మనమరాళ్లు సమానమేనని చెప్పేవా రు, వ్యాపారాలన్నింటినీ నలుగురు చిన్నబిడ్డలకు సమానంగా పంచి పెట్ట డం జగన్ బాధ్యత. ఇది మా నాన్న ఆదేశం. నా కు, జగన్‌తోపాటు భారతీరెడ్డి, మనవడు, మనుమరాళ్లు, వైఎస్ స్నేహితులు కేవీపీ రామచంద్రరావు, వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డికి కూడా తెలుసు. సండూర్ మినహా.. సరస్వతి, భారతి సిమెంట్స్, సాక్షి మీడియా, క్లాసిక్ రియాలిటీ, యలహంక ప్రాపర్టీ.. ఏవైనా నలుగురి బిడ్డలకూ సమానమే. నాన్న బతికుండగా ఏ ఆస్తి పంపకమూ జరగలేదు. ఈరోజుకూ ఒక్క ఆస్తి నా చేతుల్లో లేదు'

జగన్ ఆస్తిని అడిగాననడం అబద్ధం..

'జగన్ ఆస్తుల్లో వాటా నేను అడుగుతున్నాను అనేది హాస్యాస్పదం. అది అవాస్తవం. అవి కుటుంబ ఆస్తులు కావడం వల్లే వాటి గురించి ఇప్పటిదాకా మాట్లాడలేదు. నాకు ఈ ఆస్తులపై మోజులేదు. జగన్ పెట్టిన హింసలకు ఆస్తులు కావాలన్న కోరిక నాకు లేకుండా పోయింది. నాన్న అభిమతం ఒక్కటే నాకు, అమ్మకు ముఖ్యం.ఇప్పటికీ అమ్మ వెయ్యిసార్లు వీళ్లను (జగన్, భారతీ) అడిగి ఉంటుంది. వందల కొద్దీ లేఖలు రాసి ఉంటుంది. అయినా పట్టించుకోలేదు. కొత్త పార్టీ పెట్టి అధికారంలోకి రావడానికి ముందు పదేళ్లా జగన్ ఇబ్బందులు పడుతుంటే, ఆ ఇబ్బందులు నావిగా భావించా. తోడబుట్టినవాడి కోసం జగన్‌నూ.. వైసీపీనీ నా భుజాలపై మోశాను. ఆ పదేళ్ల పాటు బాగానే చూసుకున్నారు. జగన్ నన్ను తన పెద్ద కూతురునని ప్రకటించారు. మా నాన్న కోరుకున్నట్టే... నా పిల్లలను, తమ పిల్లలను జగన్ ఒకేలా చూశారు. షర్మిలకు ఇచ్చానని జగన్ చెబుతున్న రూ.200 కోట్లు ఈ కాలంలోనే నాకు ఇచ్చారు. అదీ డివిడెండ్‌గానే. వ్యాపారాల్లో నా బిడ్డలకు సమాన వాటా ఉన్నదని గుర్తించి.. కంపెనీల్లోని డివిడెండ్‌లో సగంవాటా నాకు ఇచ్చారు. అప్పుగా దానిని చూపించమని చెప్పారు'

బెజవాడకు పిలిపించి... చెప్పిందిదీ..

'అయితే...2019లో జగన్ సీఎం అయ్యాక గుర్తుపట్టలేనంతగా మారిపోయారు. సీఎం అయిన నెల రోజులకే 'విడిపోదాం' అని ఇజ్రాయెల్ పర్యటనలో ప్రతిపాదన పెట్టారు. విజయవాడ వచ్చాక భారతీ సిమెంట్స్, సాక్షిలో 60% వాటా కావాలని జగన్ పట్టుబట్టారు. నాకు వాటిలో 40% ఇస్తానన్నారు. ఈ ప్రతిపాదన మాకు నచ్చలేదు. అయితే.. అమ్మ మాటను బుల్డోజ్ చేసి.. సాక్షిలో 40%.. భారతీ సిమెంట్స్‌లో వాళ్లకు చెందిన 49%లో 40%, సరస్వతి పవర్‌లో 100%, యలహంక ప్రాపర్టీలో 100%, వైఎస్ నివాసమున్న ఇల్లు, ఇంకా కొన్ని ఆస్తులు... నా భాగం కింద చూపించారు. ఆ మేరకు ఎంఓయూ తయారైంది. సరస్వతి సిమెంట్స్ వాటాలు, యలహంక ప్రాపర్టీ ఈడీ అటాచ్‌మెంట్‌లో లేవని, అవి వెంటనే రాసిస్తామని.. మిగతా ఆస్తులు కేసుల వ్యవహారం తేలాక బదిలీ చేస్తామని ఆ ఎంవోయూలో పేర్కొన్నారు. ఇదంతా నా ఆస్తిని నాకు ఇవ్వడానికి జరిపిన ప్రక్రియ.. అంతే. ప్రేమాభిమానాలతో జరిపిన కేటాయింపులు ఏమాత్రం కావు' అని ఆమె పేర్కొన్నారు.

గత ఐదేళ్లూ
నాపై వేధింపులే..

- లేఖలో బయటపెట్టిన షర్మిల
- అక్షరసత్యమని తేలిన 'ఆంధ్రజ్యోతి' 'రాయబారం' కథనం

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జగన్ సీఎంగా ఉన్న గత ఐదేళ్లూ తనను అన్ని విధాలా వేధింపులకు గురి చేశారని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ అభిమానులకు రాసిన లేఖలో అప్పటి విషయాలు ఆమె పంచుకున్నారు. 2019లో నేను రాజకీయాల్లో అడుగుపెట్టాను. మొదట తెలంగాణలో, ఆ తర్వాత ఏపీలో రాజకీయ ప్రస్థానం ప్రారంభించాను. అప్పటినుంచి, గత ఐదేళ్లూ తన పత్రిక, వైసీపీ మూకల ద్వారా నాపై జగన్ దుష్ప్రచారం సాగించారు. పెళ్లయినదానినన్న ఇంగితం కూడా లేకుండా వ్యక్తిత్వ హననానికి ఒడిగట్టారు. మా బాబాయ్‌పైనా తన పత్రికలో అసభ్యంగా ఫొటోలను ప్రచురించారు. ఏపీలో వైసీపీ ఓడాక.. జగన్ నా వద్దకు బంధువులను రాయబారం కోసం పంపించారు. వివాదాలు వద్దు.. సామరస్యంగా ఆస్తి వివాదాలు పరిష్కరించుకుందామని వారి ద్వారా చెప్పి పంపించారు. (సరిగ్గా ఇదే విషయాన్ని 'షర్మిలతో రాయబేరం' అనే పేరిట సోమవారం సంచికలో ప్రచురించిన కథనంలో 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది) అయితే, ఈ రాయబారంలో జగన్ ఒక షరతు పెట్టారు. భవిష్యత్తులో జగన్, భారతి, అవినాశ్‌రెడ్డిపై నేను రాజకీయ విమర్శలు చేయరాదని ఆంక్షలు పెట్టారు. ఇది నా వృత్తి ధర్మానికి విరుద్ధమని సెటిల్‌మెంట్‌కు ఒప్పుకోలేదు. దీంతో మరింత వేధింపులకు గురిచేశారు. ఎన్‌సీఎల్‌టీ ట్రైబ్యునల్‌లో నాపై, అమ్మపై జగన్ కేసు పెట్టారు' అని షర్మిల చెప్పారు. 'సొంత చెల్లి, తల్లిపై కేసు వేసి రోడ్డు మీదకు లాగిన అపకీర్తిని జగన్ మూటగట్టుకున్నారు. దానినుంచి బయటపడటం కోసం కొత్తగా బెయిల్ రద్దు అంశం తెరపైకి తెచ్చారు. కానీ, షేర్లు బదలాయింపు జరగాల్సిన సరస్వతి పవర్ కంపెనీ ఈడీ అటాచ్‌లో లేదు. ఆయన బెయిల్‌కు వచ్చిన ముప్పేం లేదు. సాధారణంగా కుటుంబ, స్నేహబంధంతో మనుషులు ఒక్కటవుతారు. కానీ రాష్ట్రంలో వైఎస్ బంధం అనేది మనల్ని ఏకం చేసింది అందువల్లే వాస్తవాలు తెలియాలని బహిరంగ లేఖ రాస్తున్నా' అని పేర్కొన్నారు.

తెలంగాణలో అగ్రి ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పండి!

- మలేషియా ప్రభుత్వానికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి

హైదరాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అగ్రి ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు పెట్టుబడులు పెట్టడానికి ముందుకురావాలని మలేషియా దేశ వ్యవసాయ మంత్రి మహ్మద్ బిన్ సాబుకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మలేషియా పర్యటనలో ఉన్న మంత్రి.. శుక్రవారం పలు ప్రతిపాదనలు అక్కడి ప్రభుత్వం ముందు ఉంచారు. రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టాలని కోరగా, మలేషియా వ్యవసాయశాఖ మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఫెల్డా చైర్మన్ అహ్మద్ షబేరీ చీక్‌తోపాటు తన ప్రతినిధి బృందంతో మంత్రి తుమ్మల సమావేశమై ఆయిల్ పామ్ రంగంలో రాష్ట్రం సాధించిన ప్రగతిని వివరించారు. ఆయిల్ పాం రైతులకు ప్రయోజనకరంగా ఉండే పద్ధతులపై చర్చించారు. మలేషియాలో భారత హైకమిషనర్ బీఎన్‌రెడ్డితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తెనాషియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని సందర్శించి, యాంత్రీకరణకు సంబంధించి అక్కడ వివిధ రకాల యంత్రాలు, పనిముట్లు, వాటి పనివిధానాన్ని పరిశీలించారు. మలేషియా పర్యటనలో రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మిన్‌భాషా, అడిషనల్ డైరెక్టర్ సరోజిని, ఓఎస్డీ శ్రీధర్ పాల్గొన్నారు.

పత్తి రైతుల సౌకర్యం కోసం 'వాట్సప్'!

పత్తి రైతుల సౌలభ్యం కోసం మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో వాట్సప్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. 8897281111 అనే వాట్సప్ నెంబరుతో పత్తి రైతులు, పత్తి కొనుగోలు సంబంధిత సేవలు తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. రైతు పత్తి అమ్మకం, అర్హత, అమ్మకాల వివరాలు, చెల్లింపు స్థితి, సీసీఐ సెంటర్లలో వేచి ఉండే సమయం, కొనుగోళ్ల వివరాలను రైతులు తమ ఇంటి వద్దనే ఉండి ఈ వాట్సప్ చాట్ ద్వారా తెలుసుకొనే వెసులుబాటు ఉంటుందన్నారు. అలాగే ఇబ్బందులున్నా వాట్సప్ ద్వారా తెలపాలని సూచించారు.



మలేషియా పర్యటనలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల ప్రతినిధుల బృందం

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

• డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్



చెక్కును అందజేస్తున్న రాంచందర్‌నాయక్

డోర్నకల్, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్ అన్నారు. మండల ప్రజాపరిషత్‌లో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు శుక్రవారం చెక్కులను అందచేసి, ఆయన మాట్లాడారు. మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న, వైస్‌చైర్మన్ కె.కోటిలింగం, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సుమీర్‌చంద్‌జైన్, మండల పార్టీ అధ్యక్షుడు డీఎస్ జగదీష్, ఆంగోతు వెంకన్న, దోమల లక్ష్మణ్, మామిడి నాగరాజు, బత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

మరిపెడ (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్ హెచ్చరించారు. మున్సిపాలిటీలోని 5, 7వ వార్డుల్లో జరుగుతున్న అంతర్గత రోడ్ల మరమ్మతు పనులను పరిశీలించారు. రెడ్‌మిక్స్‌తో పనులు చేపట్టాల్సిన కాంట్రాక్టర్ మొరం పోయడాన్ని ఆయాకాలనీల వాసులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో అధికారులకు ఫోన్‌చేసి ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ నాయకులు యుగేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తాజుద్దీన్, మున్సిపల్ కమిషనర్ వెంకటస్వామి, నాయకులు బోడ రవి, సురేశ్, ఉపేందర్ ఉన్నారు.

కార్యకర్తలు అవినీతికి పాల్పడవద్దు..

కురవి (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాల అమలులో ప్రజల నుంచి నగదు వసూలు చేస్తే కార్యకర్తల వీపులు పగులుతాయని ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్ హెచ్చరించారు. కురవిలోని రైతు వేదికలో కురవి, సీరోలు మండలాల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, కోర్ని రవీందర్‌రెడ్డి, కాలం రవీందర్‌రెడ్డి, గార్లపాటి వెంకట్‌రెడ్డి, బండి శ్రీనివాస్, ఎర్ర నాగేశ్వర్‌రావు, వద్దుల సురేందర్‌రెడ్డి, బాలగాని శ్రీనివాస్, ఎస్.రాజేందర్‌కుమార్, శ్యామల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో 39 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు.

డిసెంబరులో రుణమాఫీ పూర్తి చేస్తాం

చిన్నగూడూరు : బడ్జెట్, బ్యాంక్ సమస్యల వల్ల రుణమాఫీలో జాప్యం జరిగిందని, డిసెంబర్‌లో రైతులందరికీ రుణమాఫీ చేస్తామని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేసి మాట్లాడారు. అనంతరం జయ్యారం నుంచి జిల్లా కేంద్రానికి బస్సు సర్వీసును ప్రారంభించారు. మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి నాగేష్ గౌడ్, నాయకులు రఘువీరారెడ్డి, రాంరెడ్డి, కమలాకర్, మురళీధర్‌రెడ్డి, రమేష్, తహసీల్దార్ మహబూబ్ అలీ, ఎంపీడీవో రామారావు, పిల్లివీరన్న, గాడిపెల్లి జీవన్, గండ్లె భద్రయ్య, భర్తపురం యాకన్న, వీరాచారి, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో అందరికీ న్యాయం

మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్



మాట్లాడుతున్న మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రజలకు మేలు జరిగిందేమిలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రజాప్రభుత్వంలో అందరికీ న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ కమిటీల్లో అవకాశం రాని వారు ఆందోళన చెందవద్దని కష్టపడ్డ ప్రతీ కాంగ్రెస్ కార్యకర్తకు సముచిత స్థానం దక్కుతుందని స్పష్టం చేశారు. అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, మిట్టకంటి రాంరెడ్డి, నీరుటి లక్ష్మినారాయణ, ఖలీల్‌పాషా, పోతురాజు రాజు, ఎడ్ల రమేష్, నిమ్మల శ్రీనివాస్, గుగులోతు వెంకట్, సిరిపురం వీరన్న పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్ : చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. ఈదులపూసపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దూపటి వినయ్ సహాకారంతో క్రీడా దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించటంతో పాటు 10 జీపీఏ సాధించే విధంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షులు ఘనపురపు అంజయ్య స్థానిక వార్డు కౌన్సిలర్ వెన్నం లక్ష్మారెడ్డి, గిరిబాబు, శ్రీపాల్‌రెడ్డి, హెచ్‌ఎం పూజారి వీరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ఇనుగుర్తి : మండల కేంద్రంలో ఇటీవలె మృతి చెందిన గుజ్జునూరి ఎల్లయ్య గంజి తరంగిని, చిన్నముప్పారంలో పెంతల రాంరెడ్డి కుటుంబాలను ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ శుక్రవారం పరామర్శించారు. ఆయా గ్రామాల్లో మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట డీసీసీ అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కూరెళ్లి సతీష్, బైరు అశోక్, చిన్నాల కట్టయ్య, గంజి రాజేందర్‌రెడ్డి ఉన్నారు.

జీపీ వర్కర్స్‌యూనియన్ మహిళ కమిటీ ఎన్నిక

నెల్లికుదురు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల మహిళ కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లం ఎల్లయ్య ఒక ప్రకటనలోతెలిపారు. మండల మహిళకమిటీ కన్వీనర్‌గా హెచ్ భవాణి, కో-కన్వీనర్‌గా ఏర్పుల విజయ, సహాయ కార్యదర్శిగా చెడుపాక ఉపేంద్రలను నియమించినట్లు తెలిపారు.

క్రైం కార్నర్

బ్యాంకు ఖాతా నుంచి రూ. 7.69 లక్షలు మాయం

నర్సింహులపేట ఠాణాలో సైబర్ కేసు నమోదు

నర్సింహులపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటిగూడెం గ్రామానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి బ్యాంకు ఖాతా నుంచి రూ.7.69 లక్షలు మాయమైన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై సురేష్ వివరాల ప్రకారం. పటమటిగూడెంకు చెందిన అక్కిరెడ్డి వేణు హైదరాబాద్‌లో ఓ కంపెనీలో ప్రైవేటు ఉద్యోగి. 2023 నవంబరు 14 అతడికి టెలిగ్రామ్‌లో ఓ కంపెనీకి సంబంధించిన లింకు రావడంతో ఓపెన్ చేశాడు. ఆ కంపెనీలో పెట్టుబడులు పెడితే లాభాలు వస్తాయని ఆశ చూపారు. రూ. 7,69,360 అప్పు చేసి పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. అప్పటి నుంచి 2024 జనవరి వరకు కొంత సొమ్ము రికవరీ చేసినట్లు తెలిపారు. ఫిబ్రవరి నుంచి పెట్టుబడులు రిటన్ రాకపోవడంతో మోసపోయానని గుర్తించిన బాధితుడు 1093 కి కాల్‌చేసి సైబర్ క్రైమ్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తక్షణమే అప్రమత్తమైన వారు రూ. 1.05 లక్షలను హోల్డ్‌లో పెట్టినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తహసీల్దార్‌ను దూషించిన వ్యక్తి అరెస్ట్

నెల్లికుదురు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : అక్రమ ఇసుక రవాణాను తహసీల్దార్ రాజు అడ్డుకుంటున్న క్రమంలో తహసీల్దార్‌ను దూషించిన వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు. ఆకేరు వాగులో ఇసుక ట్రాక్టర్లను పట్టుకోవడానికి వెళ్లిన తహసీల్దార్‌ను బ్రాహ్మణ కొత్తపెల్లికి చెందిన జెల్ల యాకయ్య అసభ్య పదజాలంతో దూషించాడని రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పశుసంపద కీలకం

• అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో



పశుగణన కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న లెనిన్‌వత్సల్ టొప్పో

మహబూబాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పశు సంపద అత్యంత కీలకపాత్ర పోషిస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో అన్నారు. మానవ జీవనశైలిలో శాస్త్ర సాంకేతికంగా ఎంతో పురోగతి సాధించినప్పటికి అధిక శాతం రైతులు వ్యవసాయ అనుబంధ రంగమైన పాడి పశువులు, గొర్రెల మేకల పెంపకం, దేశీయ కోళ్ల ఆధారంగానే జీవనోపాధి పొందుతున్నారని చెప్పారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఈనెల 25వ తేదీ నుంచి 28 ఫిబ్రవరి 2025 వరకు నిర్వహించనున్న అఖిల భారతజాతీయ పశుగణన కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 23 మంది సూపర్‌వైజర్లు, 76 మంది ఎనిమిరేటర్లతో పట్టణాలు, గ్రామాల్లో ప్రతీఇంటి వద్దకు వెళ్లి రైతుల నుంచి పశుసంపద సమాచారాన్ని సేకరించి డిజిటలైజేషన్ ద్వారా వివరాలను పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి కిరణ్‌కుమార్, అధికారులు బి.రామచంద్ర, ఎన్.అశోక్, నోడల్ అధికారి ఆర్.శ్రావణ్‌కుమార్, ఆర్ఆర్ ప్రియదర్శిని, రాజేందర్ తదితనేతలు పాల్గొన్నారు.

రైతు భరోసా రూ.15 వేలు ఇవ్వాలి

చిన్నగూడూరు, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి) : రైతు భరోసా ఖరీఫ్, రబీ సీజన్లకు రూ.15 వేలు ఇవ్వాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నాయకుడు బండపల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం అన్నిరకాల వరి పంటకు రూ.500 బోనస్, రుణమాఫీ చేసి కొత్త రణాలు ఇవ్వాలని రైతుల పలు సమస్యలను పరిష్కరించాలని డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గౌస్, వెంకన్న, రామ్మూర్తి, రామనర్సయ్య, రాజయ్య పాల్గొన్నారు.

'ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి'

తొర్రూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్లను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. శుక్రవారం తొర్రూరులో ఆటో యూనియన్ నాయకులతో కలిసి వచ్చేనెల 5న హైదరాబాద్‌లో జరిగే ఆటో కార్మికుల ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకంతో నష్టపోతున్న ఆటోడ్రైవర్లకు నెలకు రూ.12 వేల వేతనాలు ఇస్తామని మాట ఇచ్చి అమలుకు నోచుకోవడం లేదన్నారు.

బాబును కలిసిన మానుకోట టీడీపీ నేతలు



సీఎం చంద్రబాబును కలిసిన మానుకోట టీడీపీ నేతలు

నెహ్రూసెంటర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఏపీ సీఎం చంద్రబాబును మానుకోట టీడీపీ నేతలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతి సచివాలయంలో బాబు కలిసి పుష్పగుచ్ఛం అందించారు. గత ఐదు సంవత్సరాల క్రితం చిలకల్లు రహదారిపై బైక్ యాక్సిడెంట్‌కు గురై కాలు, చేయి పడిపోయిన ఏపీఎస్ఆర్టీసీ డ్రైవర్ నూనావత్ వీరబాబు సతీమణి నూనావత్ తేజస్వినికి ఏపీఎస్ఆర్టీసీలో ఉద్యోగం కల్పించి, ఆదుకోవాలని చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర కార్యదర్శి సుతారపు వెంకటనారాయణ, అధికార ప్రతినిధి ప్రేమ్‌చంద్‌వ్యాస్, నూకల పుల్లయ్య, భూక్య అర్జున్, నెహ్రూ పాల్గొన్నారు



సీపీఎం మండల మహాసభలో ప్రసంగిస్తున్న జి.నాగయ్య

హామీలను అమలు చేసే వరకు పోరాటం

• సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య

గార్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు సమరశీల పోరాటాలకు నిర్వహించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం గార్లలో వర్తక సంఘం భవనంలో సీపీఎం 9వ మండల మహాసభలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. దేశవ్యాప్తంగా పాలకపక్షాల అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఎం పార్టీ రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. మహాసభలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.సోమయ్య, జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, కందునూరి శ్రీనివాస్, ఈశ్వర లింగం, వెంకటేశ్వర్లు, సత్యవతి, కవిత, అంబటి వీరస్వామి, ఇమ్మడి గోవిందు, బొమ్మన అశోక్‌కుమార్, అలవాల రామకృష్ణ, పాల్గొన్నారు.

'ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడులు'

నర్సింహులపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభం ఉంటుందని డీఏవో మరియన్న అన్నారు. నర్సింహులపేట, రామన్నగూడెం, పడమటిగూడెం, పెద్దనాగారంలో శుక్రవారం పర్యటించారు. ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు పంట చేలల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీహెచ్‌వో మాట్లాడుతూ పంట మార్పిడితో ఆయిల్‌పామ్‌ను సాగు చేసుకొని ఎకరానికి రూ.లక్ష చొప్పున ఆదాయం పొందాలన్నారు. పొలం గట్లు, ఇంటి ముంగిట, డాబాల మీద, కూరగాయలు సాగు చేసుకోవచ్చన్నారు. పొలం చుట్టూ ఆయిల్‌పామ్‌ను సాగు చేసుకోవచ్చన్నారు. కూరగాయలు, ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని వినియోగించుకోవాలన్నారు. హెచ్‌వోలు ఏజే శాంతి, ప్రియదర్శిని, రాములు, రైతులు రవి, రాంరెడ్డి, రేఖ యాకన్న ఉన్నారు.

హైదరాబాద్‌కు తరలిన మునిసిపల్ కార్మికులు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌తో శుక్రవారం హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన మహాధర్నాకు మహబూబాబాద్ జిల్లా నుంచి మునిసిపల్ కార్మికులు తరలి పోయారు. సీఐటీయూ అనుబంధ మునిసిపాలిటీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు పెద్దఎత్తున తరలిపోయారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్మరికుంట్ల నాగన్న మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ తరలిపోయిన వారిలో మునిసిపల్ కార్మిక సంఘం కాంపల్లి శ్రీనివాసు, గుర్రాల పుష్పరాజు, కందుకూరు జానీ, మనోహర్, ఎల్లయ్య, ఇమ్మడి పద్మ, లక్ష్మి, సుజాత, రజిని, వీరన్న, వెంకన్న, మల్లేష్, రాజు, అంజయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు

• ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి నక్క సైదులు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కళాకారులు తమ సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని ప్రజానాట్యమండలి (పీఎన్‌ఎం) జిల్లాకార్యదర్శి నక్క సైదులు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథంభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. మాట్లాడుతూ కళలను నమ్ముకుని జీవిస్తున్న వృత్తి కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సాంస్కృతిక రంగంలో ప్రజలను చైతన్యవంతం చేయడంలో పీఎన్‌ఎం కళాకారులు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో కళాకారుల ఇచ్చిన హామీలను పాలకులు అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని కోరారు. నూనె శ్రీనివాస్, మాంకాల రాజు, హరిత, మచ్చ వెంకన్న, అచ్చ నాగేష్, శేఖర్, ఎల్లమ్మ, వెంకన్న, ఎల్లయ్య రామకృష్ణ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంటు నిధులు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన చేపట్టి ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయకపోవడంతో యాజమన్యాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వెంటనే నిధులు మంజూరు చేయాలని తెలిపారు. అనంతరం సదరు డిమాండ్‌తో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ భగవాన్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో గుగులోతు సూర్యప్రకాష్, రాకేష్, ప్రవీణ్, మహేష్, వినయ్ పాల్గొన్నారు.

పారా త్రోబాల్ క్రీడాకారిణి భాగ్యకు ఆర్థిక సాయం

• రూ.32 వేలు అందజేసిన బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు



భాగ్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

గూడూరు, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గొల్లగూడెంకు చెందిన దయ్యాల భాగ్య అంతర్జాతీయ పారా త్రోబాల్ పోటీలకు ఎంపికై ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తోంది. ఈ క్రమంలో అక్టోబర్ 15న అంతర్జాతీయ పారా త్రోబాల్ జట్టుకు భాగ్య ఎంపిక.. ఆర్థికంగా ఆదుకోవాలని కలెక్టర్‌కు దివ్యాంగురాలు వినతి అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పులి దేవేందర్ ఫౌండేషన్ మిత్రుల ద్వారా రూ.32 వేల చెక్కును శుక్రవారం భాగ్య కుటుంబసభ్యులకు అందజేశారు. ఏంఈవో జంజర్ల రవికుమార్ చేతుల మీదుగా భాగ్య కుటుంబసభ్యులకు చెక్కును అందించారు. ఫౌండేషన్‌సభ్యులు పెండ్యాల కృష్ణ, సోమరవి,జన్ను రాజమౌళి, పాత్రికేయులు బుర్ర వేణు, వెంకటేష్, యాదగిరి, అశోక్, శ్రీధర్, ఇమ్రాన్, సాంబమూర్తి, రవిచంద్ర, రాము, విజయ్, కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

• బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేం వెంకటకృష్ణారెడ్డి

గూడూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ నాయకులు ఉద్యమించాలని ఆ పార్టీ గూడూరు మండల అధ్యక్షుడు వేం వెంకటకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గూడూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గత రెండ్రోజుల క్రితం చేపట్టిన బీఆర్ఎస్ ఉపవాస దీక్షను శుక్రవారం దీక్షలో కూర్చున్న వారికి ఆయన నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. ఈ ఉపవాస దీక్షల్లో కూర్చున్న వారిలో ఎండి.రహీం, భూక్య సురేష్ నాయక్, బోడ ఎల్లయ్య, నూకల అశోక్, ఎండి. హైమద్, నాగేంద్రబాబు, మైదం రాజుపటేల్, దోమ వెంకన్న, చీదురు అనిల్, బానోత్ విజయ్ ఉన్నారు. కార్యక్రమంలో మండల మాజీ వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, సంపత్‌రావు, కటార్ సింగ్, నూకల సురేందర్, చీదురు వెంకన్న, బోడ కిషన్, సంపంగి రాములు, రాంచందర్, ఎదునూరి వెంకన్న, ఎడ్లరమేష్, బెజ్జం రమేష్, కుమారస్వామి పాల్గొన్నారు.

ఓటరు నమోదును వేగవంతం చేయాలి

గూడూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదును వేగవంతం చేయాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీష్‌రెడ్డి పిలుపునిచ్చారు. దామెరవంచ గిరిజన బాలుర గురుకుల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, బ్రహ్మణపల్లిలో కేజీబీవీ గురుకుల పాఠశాల, సీతానగరం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలను శుక్రవారం సందర్శించి ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు రవిచంద్ర, వెంకటేశ్వర్లు, రాష్ట్ర బాధ్యులు లక్షపతి, బాలయ్య, నమల్వార్, విజయ్‌కుమార్, జిల్లా బాధ్యులు లక్ష్మయ్య, కమలాకర్‌రెడ్డి, బాలమురళీధర్, సునీత, పగడయ్య, కృష్ణమూర్తి, గోపినాథ్, రాము పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు

కేసముద్రం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెనుగొండ క్రాస్‌రోడ్డు, కేసముద్రం విలేజిలో శుక్రవారం ఎస్ఐ మురళీధర్‌రాజ్ ఆధ్వర్యంలో వాహనాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని రకాల వాహనాలనునిలిపి అవసరమైన పత్రాలను పరిశీలించారు. బైక్‌పై ముగ్గురు ప్రయాణం చేయడం తదితర ట్రాఫిక్ నిబంధనలను పాటించని వాహనదారులకు జరిమానాలు విధించి, అవగాహన ఎస్సై కల్పించారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా : పాలకుర్తి ఎమ్మెల్యే



మాట్లాడుతున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ అభివృద్ధికి అన్నివిధాలుగా కృషి చేస్తామని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం తొర్రూరులోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సహాయంతో అన్నిగ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గ్రామ పంచాయతీల నిర్మాణాలకు స్థలసేకరణ, ప్రత్యేక నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చేందుకు త్వరలో దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. తొర్రూరు మునిసి పాలిటీ అభివృద్ధికి సీఆర్ఆర్ ఫండ్స్ నుంచి రూ.21కోట్లు, టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.5కోట్ల నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె. నిరంజన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సంతోష్, సోమరాజశేఖర్, జినుగ సురేందర్ రెడ్డి, మెరుగు మల్లేశం, బిజ్జాల అనిల్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయండి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించే పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయాలని సంఘం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఫైండ్ల యాకయ్య పిలుపినిచ్చారు. మహబూబాబాద్‌లో శుక్రవారం 50 వసంతాల స్వర్ణోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీడీఎస్‌యూ ఆవిర్భవించి ఈనెల 12, 13 తేదీ నాటికి 50 సంవత్సరాలు పూర్తి అయ్యాయని తెలిపారు. ఈ మహాసభకు పూర్వ, ప్రస్తుత విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొట్ల గౌతం, గణేష్, చరణ్, దేవేందర్, జశ్వంత్, నితిన్, అభిలాష్, సుమంత్‌గౌడ్, భానుచారి, హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నేత సతీష్‌గౌడ్

గూడూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మణపల్లి కేజీబీవీ పాఠశాలలో ఉన్న ఆర్వో ప్లాంట్‌ను అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బుడిగే సతీష్‌గౌడ్ మరమ్మతులు చేయించారు. సుమారు నాలుగేళ్లుగా పనిచేయకుండా ఉన్న ఆర్వోప్లాంట్‌కు సతీష్‌గౌడ్ తన సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించి, తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఎంఈవో రవికుమార్, పాఠశాల ఎస్‌వో సునిత, భూపతి శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాహనాలను అమ్ముకుంటున్నారు

నెహ్రూసెంటర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సారా కేసులో పట్టుబడిన వాహనాలకు వేలం వేయకుండానే అమ్ముకున్నారని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు భీమానాయక్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని అనంతాద్రి సమీపంలో గల ఎక్సైజ్ కార్యాలయం ముందు శుక్రవారం బాధితులు ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ కార్యాలయంలో పట్టుబడిన వాహనాలకు వేలం వేస్తున్న తక్షణమే అమ్ముకున్న వాహనాలను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. మంగీలాల్, సోమ్లు, సుమన్, తరుణ్, కృష్ణ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'ఉపాధ్యాయులను కేటాయించాలి'

నర్సింహులపేట, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్న బడికి మాత్రమే ఉపాధ్యాయులను కేటాయించాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు క్రాంతి కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన టీపీటీఎఫ్ మండల కమిటీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల డీఎస్సీలో ఎన్నికైన నూతన ఉపాధ్యాయులతో పాటు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను విద్యార్థులు ఉన్న బడికి కాకుండా విద్యార్థులు లేని పాఠశాలలకు కేటాయించడం దారుణమన్నారు. టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, యాకన్న, నర్సింహారావు, బాలాజీ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితులను శిక్షించాలి

తొర్రూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : బాలికలపై జరుగుతున్న అత్యాచారాల నిందితులను కఠినంగా శిక్షించాలని జిల్లా చిల్డ్రన్స్ రైట్ ప్రొటెక్షన్ ఫోరం ఇన్‌చార్జి డొనికెన కుమారస్వామి కోరారు. శుక్రవారం తొర్రూరులో మాట్లాడుతూ సమాజంలో ఈ ఇలాంటి సంఘటనలు జరుగుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు ఆడపిల్లలను కనేందుకే భయపడుతున్నారని, కొందరు చిరుప్రాయంలోనే ఆడపిల్లలను వదిలి వేస్తున్నారని, మరికొందరు స్కానింగ్‌ల ద్వారా గుర్తించి అబార్షన్‌తో భ్రూణహత్యలకు పాల్పడుతున్నారన్నారు. సమాజ మార్పు కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కల్గి ఉండాలి

తొర్రూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి శుక్రవారం తొర్రూరులో జానపద కళాకారులతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ హెచ్ఐవీని తరిమికొట్టడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు స్వచ్ఛంద సంస్థల ద్వారా విస్తృత ప్రచారం చేస్తుందన్నారు. మరింత సమాచారం కోసం 1097 నంబరుకు ఫోన్ చేసి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శాంతరాజు, యాకేందర్, బాలాజీ, శ్రీనివాస్, శాంతమ్మ, ప్రసాద్, కె.వి రెడ్డి, కళాకారులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

పెద్దవంగర, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని డీఈ మధుసూదన్ అన్నారు. టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎండీ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో శుక్రవారం విద్యుత్ అధికారులతో కలిసి పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలకు అవసరమైన స్తంభాలు, విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లను అందిస్తామన్నారు. విద్యుత్‌షాక్ రాకుండా విధిగా ఎర్త్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ రమేష్, జేఎల్ ఎంలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.